సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం । 20 । ఆగస్టు । 2025

ఆత్మీయం.. ఆనందం



న్యూస్‌రీల్

24న టీటీసీ థియరీ పరీక్ష

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్లో ఈ నెల 24వ తేదీ టీటీసీ థియరీ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, అదే రోజు 2 గంటల నుంచి 3 గంటల వరకు , అదే విధంగా సాయంత్రం 3.30 గంటల నుంచి 4.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఇలా వరుసగా మూడు సెషన్స్‌గా మూడు పరీక్షలు ఉంటాయని వెల్లడించారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను www.bre.ap.gov.inలో డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు వారి హాల్‌టికెట్‌తోపాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదేని గుర్తింపుకార్డుతో ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని డీఈఓ సూచించారు.

పరీక్షా ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఉపకులపతి ఆచార్య విశ్వనాథకుమార్

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ప్లానింగ్, ఫైన్ ఆర్ట్స్ విభాగాలకు సంబంధించిన 2,4,6వ సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాలను యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జి. విశ్వనాథ్‌కుమార్ మంగళవారం విడుదల చేశారు. ఈ 2,4,6 సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి 162 మంది విద్యార్థులకుగాను 134 మంది ఉత్తీర్ణత సాధించగా 28 మంది ఫెయిల్ అయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఫణీంద్రరెడ్డి, సహాయ పరీక్షల నియంత్రణాధికారి ఉదయ్‌ప్రకాష్‌రెడ్డి, నారాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు యాఖూబియా బగ్దాదియా ఉరుసు



హజరత్ యాఖూబ్ బగ్దాదీ సాహెబ్ (ఫైల్)

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని షాహీపేటలో బగ్దాదియా పీఠం ఆధ్వర్యంలో బుధవారం హజరత్ మౌలానా సయ్యద్ షా మహమ్మద్ యాఖూబ్ బగ్దాది సాహెబ్ 26వ ఉరుసు నిర్వహించనున్నట్లు పీఠాధిపతి హజరత్ మహమ్మద్ అలీ బగ్దాదీ తెలిపారు. ఉరుసు సందర్భంగా సాయంత్రం అసర్ నమాజు తర్వాత ఖురాన్ పఠనం, జల్సా అజీమత్ ఏ ఔలియా, రాత్రి ఫాతెహా తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హజరత్ యాఖూబ్ బగ్దాది సాహెబ్ స్థాపించిన జామియా ఇస్లామియా మదరసాలో పిల్లలకు ఉచిత విద్య తదితర కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. ప్రతి ఒక్కరూ పాల్గొని ఉరుసును విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఉప్పొంగిన అభిమానం



రాజంపేట పరిధిలో అభిమానులకు అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- వైఎస్ జగన్ రాకతో సందడే సందడి
- అడుగడుగునా జన నీరాజనం
- హెలీప్యాడ్ వద్ద కిక్కిరిసిన అభిమానులు
- 'ఆకేపాటి' వారి రిసెప్షన్‌కు హాజరైన జననేత
- నూతన వధూవరులకు ఆశీర్వాదం
- హోరెత్తిన జగన్నినాదాలు

సాక్షి రాయచోటి: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో అభిమానం ఉప్పొంగింది. ఆయన రాకతో అన్నమయ్య జిల్లాలో సందడి వాతావరణం నెలకొంది. రాజంపేట పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో పండుగ వాతావరణం కనిపించింది. ఎస్టేట్‌లోని ఆకేపాటి స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి పార్టీ నేతలతోపాటు కార్యకర్తలు, అభిమానులు, ఆకేపాటి కుటుంబీకులు, బంధువులతో ఆ ప్రాంతం కళకళలాడింది. మాజీ సీఎం హెలీప్యాడ్‌లో అడుగు పెట్టినప్పటి నుంచి.. తిరుగు ప్రయాణం అయ్యే వరకు చుట్టూ ఎక్కడ చూసినా జగనిన్నాదాలతో హోరెత్తింది. మరోపక్క యువత, పార్టీ శ్రేణులు సీఎం.. సీఎం.. అంటూ నినదించారు. ఇసుకేస్తే రాలనంత జనంతో కిక్కిరిసిపోయింది.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

అన్నమయ్య జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సోదరుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, సుజనల కుమారుడు ఆకేపాటి అనురాగ్‌రెడ్డి, వరదీక్షితరెడ్డిలను మంగళవారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించారు. ఆకేపాటి ఎస్టేట్‌లోని స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన రిసెప్షన్ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సతీమణి అమరజ్యోతమ్మ, అనిల్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను వైఎస్ జగన్‌కు పరిచయం చేశారు. అనంతరం వారితో కాసేపు ముచ్చటించారు.

ఘన స్వాగతం

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హెలీప్యాడ్‌లో వైఎస్సార్ సీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డితోపాటు ఇతర నాయకులు సాదర స్వాగతం పలికారు. కొంత మంది నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి అధినేతకు ఆహ్వానం పలికారు. అనంతరం హెలీప్యాడ్ నుంచి నేరుగా రిసెప్షన్‌కు మాజీ సీఎం పయనమయ్యారు. అడుగడుగునా వైఎస్ జగన్‌కు జనాలు బ్రహ్మరథం పడుతూ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమానంతరం వైఎస్ జగన్ బెంగళూరుకు తిరుగు పయనమయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన రాజంపేట పరిధిలో విజయవంతంగా ముగియడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.



జనమే జనం

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం 11.25 గంటల ప్రాంతంలో బాలిరెడ్డిపల్లె సమీపంలోని హెలీప్యాడ్‌లో దిగిన దగ్గరి నుంచి.. ఆకేపాటి ఎస్టేట్ వరకు ఎక్కడ చూసినా జనమే కనిపించారు. కడప–రేణిగుంట ప్రధాన రహదారిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు వెళ్లే దారి అంతా కూడా వాహనాలతోనే కనిపించింది. హెలీప్యాడ్ చుట్టూ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు జెండాలు చేతబూని జగన్.. జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. మరోపక్క సీఎం.. సీఎం.. అంటూ కూడా కేరింతలు కొట్టారు. హెలీప్యాడ్‌తోపాటు చుట్టూ మిద్దెల మీద నిలుచొని జగన్‌ను తిలకించారు. హెలీప్యాడ్ నుంచి ఆకేపాటి ఎస్టేట్ వరకు సుమారు కిలోమీటరుకు పైగా రోడ్డు వెంట ఎక్కడ చూసినా జనమే కనిపించారు. ఎస్టేట్‌లో అయితే జన నీరాజనం కనిపించింది. ఇసుకేస్తే రాలనంత జనంతో ఎటువైపు చూసినా పార్టీ శ్రేణులు, ఆకేపాటి బంధువులు, స్నేహితులతో ఆ ప్రాంతమంతా రద్దీగా మారింది. వైఎస్ జగన్‌పై పూలవర్షం కురిపిస్తుండగా.. ఆయన అలా ముందుకు కదిలారు.

పార్టీ నేతలతో కాసేపు..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ నేతలతో కాసేపు మాట్లాడారు. హెలీప్యాడ్ వద్ద చాలా మంది నాయకులు కలిసి చర్చించారు. తర్వాత ఆకేపాటి కుటుంబీకుల రిసెప్షన్ కార్యక్రమం వద్ద కూడా కొంత మంది నాయకులు, కార్యకర్తలు కలిసి మాట్లాడారు. ప్రధానంగా మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌ఎండీ అంజద్‌బాషా, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, వైఎస్సార్ సీపీ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కడప మేయర్ కొత్తమద్ది సురేష్‌బాబు, ఎమ్మెల్యే దాసరి సుధమ్మ, మాజీ ఎమ్మెల్యేలు శెట్టిపల్లి రఘురామిరెడ్డి, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు పొన్నపు రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, పార్టీ పరిశీలకులు ఎస్.అనిషారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, జిల్లా పరిషత్ అధ్యక్షులు ముత్యాల రామగోవిందరెడ్డి, మదనపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి నిసార్ అహ్మద్, అనంతపురం పార్టీ నేత వెన్నపూస రవీంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేశాయి తిప్పారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు సుగువాసి బాలసుబ్రమణ్యం, మాజీ ఉపాధ్యక్షులు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, రైతు సంఘం నాయకుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్‌కుమార్, బీసీ నాయకుడు శిబ్యాల విజయభాస్కర్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఏపీటీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు బొప్పా గంగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షులు వల్లంబాయి రిషికేశ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఏకుల రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ రైల్వేకోడూరు నాయకులు ధ్వజారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, సురేఖారెడ్డి తదితరులు పార్టీ అధినేతను కలిసి మాట్లాడారు.

జిల్లాలో పలువురు సీఐల బదిలీ

కడప అర్బన్: జిల్లాలోని పలు ప్రాంతాలలో పనిచేస్తున్న సీఐలను కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 8 మంది బదిలీల వివరాలిలా ఉన్నాయి.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
జి. సుబ్బారావు	వీఆర్, కడప	కడప టూటౌన్ పీఎస్
ఎన్. క్రిష్ణయ్య	వీఆర్, కడప	బద్వేల్ రూరల్ సర్కిల్
ఎం. నాగభూషణ్	బద్వేల్ రూరల్ సర్కిల్	సీకేదిన్నె పీఎస్
ఎస్.డి.శివశంకర్ నాయక్	సీకే దిన్నె పీఎస్	ఎస్.బి–2, కడప
డి. భాస్కర్ రెడ్డి	ఎస్.బి –2 కడప	ఎస్.బి–1, కడప
ఆర్.పురుషోత్తం రాజు	ఎస్.బి–1, కడప	ఎస్సీ/ఎస్టీ సెల్, కడప
వి. వేణుగోపాల్	ఎస్సీ,ఎస్టీ సెల్, కడప	ప్రొద్దుటూరు త్రీటౌన్
ఏ. గోవిందరెడ్డి	ప్రొద్దుటూరు త్రీ టౌన్	వి.ఆర్, కడప

జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు



కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో రెండు వారాల నుంచి వర్షాలు కొనసాగుతూనే ఉన్నాయి. కడప, ప్రొద్దుటూరు లాంటి పట్టణాల్లో అధిక వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు నీటితో నిండి జనాలు అవస్థలు పడుతున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షాల వివరాలు ఇలా ఉన్నాయి. పోరుమామిళ్లలో అత్యధికంగా 23.2 మి.మీ వర్షం కురిసింది. అలాగే కలసపాడులో 11 , సింహాద్రిపురంలో 8.2, పెద్దముడియంలో 6.4 , కాశినాయన, వేములలో 6 , కొండాపురం, సిద్దవటంలో 3.6, జమ్మలమడుగులో 3.4, వేంపల్లిలో 3.2, ఎర్రగుంట్లలో 3, కమలాపురంలో 2.4, కడపలో 2.2, బి.మఠంలో 2 , మైదుకూరు, దువ్వూరులలో 1.8, ముద్దనూరులో 1.6, బద్వేల్‌లో 1.2, అట్లూరులో 0.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

క్యాంపస్‌లో 'డిగ్రీ' ప్రవేశానికి దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో పలు కోర్సులలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు విశ్వవిద్యాలయ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మి ప్రసాద్ వెల్లడించారు. నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సు, నాలుగేళ్ల హానర్స్ కోర్సులైన బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ కోర్సులు అలాగే ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులైన బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్, అప్లైడ్ జియాలజీ కోర్సులలో అడ్మిషన్లు ఉంటాయన్నారు. ఈ కోర్సులలో చేరడానికి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత చాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ అడ్మిషన్ మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఓఎయండీసీ) సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. క్యాంపస్‌లో 50వేల పుస్తకాలతో గ్రంథాలయం విద్యార్థులకు అందుబాటులో ఉందన్నారు. బాల బాలికలకు వేర్వేరుగా వసతిగృహాలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

శాంతియుతంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ

- మట్టి విగ్రహాలనే పూజించాలి
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో ఎస్పీ

కడప సెవెన్‌రోడ్స్: శాంతియుత, ఆహ్లాదకర వాతావరణంలో వినాయక ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు శాంతి కమిటీ సభ్యులు సమన్వయ సహకారాలు అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. జిల్లాలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్ లో శాంతి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్‌తోపాటు ఎస్పీ అశోక్ కుమార్, జేసీ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా మన జిల్లా ప్రసిద్ధి చెందిందన్నారు. అన్ని మతాల ప్రజల సహకారంతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గణేష్ ఉత్సవాలలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఉత్సవాలు విజయవంతం చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టివిగ్రహాలనే పూజించాలన్నారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం నిర్దేశించిన మేరకు మాత్రమే సౌండ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని ఉత్సవ నిర్వాహకులను ఆదేశించారు. నిమజ్జనం జరిగే ప్రాంతంలో గజ ఈతగాళ్లను, సిద్ధంగా ఉంచాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. నిమజ్జనానికి వెళ్లే దారిలో, సమీపంలో ఉన్న మద్యం దుకాణాలను మూసివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిమజ్జనం మార్గంలో కరెంట్ తీగలు, కేబుల్ వైర్లు అడ్డు రాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గణేష్ ఉత్సవాలకు సంబంధించి.. ఎక్కడైనా ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారులకు, పోలీసు సిబ్బందికి సమాచారమివ్వలన్నారు. అనవసరమైన విషయాలను అత్యుత్సాహంతో సోషల్ మీడియాలలో యువత పోస్ట్ చేయడం వంటి చర్యలను అరికట్టేలా శాంతి కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్ స్థాయిలో కోఆర్డినేట్ మీటింగ్ నిర్వహించాలన్నారు. 108, మెడికల్ క్యాంపులను ఏర్పాటు వైద్యాధికారులు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ పంచాయతీలో వసతులు కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు.మున్సిపల్ కమిషనర్ శానిటేషన్ పై పూర్తి దృష్టి సారించాలన్నారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తి భావంతో జరుపుకునేందుకు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు, శాంతిభద్రతలకు, మతసామరస్యానికి ఇబ్బంది కలగకుండా వినాయక ఉత్సవాలు నిర్వహించాలన్నారు. ప్రాంతాల, వీధుల వారీగా ఏర్పాటు చేస్తున్న ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు ముందస్తుగా సంబంధిత అధికారుల వద్ద అనుమతులు తీసుకోవాలన్నారు. ఉత్సవ కమిటీ ఆర్గనైజర్స్ పూర్తి వివరాలు ఆన్లైన్ యాప్ ద్వారా అప్లై చేసుకోవాలన్నారు. కడపలో దాదాపు 250, ప్రొద్దుటూరులో దాదాపు 150 సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాల నిర్వహణలో శాంతి భద్రతల ఏర్పాట్లపై పలువురు శాంతి కమిటీ సభ్యుల అభిప్రాయాలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు జాన్ ఇర్విన్, చంద్రమోహన్, సాయి శ్రీ,కడప కార్పొరేషన్ కమిషనర్ మనోజ్ రెడ్డి, పోలీసు అధికారులు, గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ అధ్యక్షుడు మునగా సతీష్, జనరల్ సెక్రటరీ కేవీ లక్ష్మి నారాయన రెడ్డి, జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షుడు చెన్నకృష్ణారెడ్డి, శాంతి కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆ ఒక్కరు సెలవు పెడితే!

ప్రాథమిక విద్యలో వెనక'బడి'..

- 1 నుంచి 5వ తరగతుల వరకు ఒక్కరే బోధన
- కూటమి అడ్డగోలు నిర్ణయాలతో అగమ్యగోచరంగా చదువులు
- జిల్లావ్యాప్తంగా 701 ఏకోపాధ్యాయ పాఠశాలలు



కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో ప్రాథమిక విద్య ఎంతో కీలకం. ఇక్కడ బలమైన పునాది పడితేనే జీవితంలో నిలదొక్కుకోగలుగుతారు. అలాంటి ప్రాథమిక విద్యపై కూటమి సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ విద్యను నీరుగార్చి ప్రైవేటు విద్యారంగానికి ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటోందన్న విమర్శ ఉంది. ఇప్పటికే పిల్లలు లేక జిల్లావ్యాప్తంగా 27 పాఠశాలలు మూతపడగా.. ప్రస్తుతం జిల్లాలోని 701 పాఠశాలల్లో ఏకోపాధ్యాయులు సేవలందిస్తుండడం ఆందోళనకరంగా మారింది. ఈ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు సెలవు పెడితే విద్యార్థుల చదువులు అటకెక్కే పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాథమిక పాఠశాల వివరాలు ఇలా...

జిల్లావ్యాప్తంగా 1659 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అందులో 48,461 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందులో 701 స్కూళ్లు ఏకోపాధ్యాయ పాఠశాలలు నడుస్తున్నాయి. ఈ స్కూళ్ల నిర్వహణతోపాటు విద్యార్థులకు ఇంగ్లిష్, తెలుగు, లెక్కలు ఇలా అన్ని సబ్జెక్టులను ఒక్కరే బోధించాల్సి వస్తోంది.ఈ పరిస్థితి చూస్తే ప్రభుత్వ బడుల్లో చదువెలా సాగుతుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మేధావులు చెబుతున్నారు.



కడప నాగరాజుపేటలోని ఉర్దూ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

మండలాల వారీగా ఏకోపాధ్యాయ పాఠశాలలు

జిల్లావ్యాప్తంగా 701 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మండలాల వారీగా అట్లూరులో 19, బి.కోడూరులో 17, బి.మఠంలో 19, బద్వేల్‌లో 31, సీకేదిన్నెలో 14, చక్రాయపేటలో 32, చాపాడులో 28, చెన్నూరులో 16, కడపలో 15, దువ్వూరులో 19, గోపవరంలో 20, జమ్మలమడుగులో 14, కలసపాడులో 16, కమలాపురంలో 28, ఖాజీపేటలో 32, కొండాపురంలో 18, లింగాలలో 10, ముద్దనూరులో 18, మైదుకూరులో 35, మైలవరంలో 27, పెద్దముడియంలో 13, పెండ్లిమర్రిలో 28, పోరుమామిళ్లలో 22, ప్రొద్దుటూరులో 22, పులివెందుల్లో 9, రాజుపాలెంలో 15, కాశినాయనలో 10, సిద్దవటంలో 18, సింహాద్రిపురంలో 20, తొండూరులో 17, వీఎన్‌పల్లిలో 19, వల్లూరులో 24, వేంపల్లిలో 11, వేములలో 13, ఒంటిమిట్టలో 9, ఎర్రగుంట్లలో 21 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి.

పర్యవేక్షణ కరువే...

ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి చదువు చెప్పడం ఎంత కష్టమో వారిని పర్యవేక్షించడం అంతకన్నా కష్టమని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్న స్కూళ్లో ఈ సమస్యను ఎదుర్కోవడం పెద్ద కష్టమేమి కాదు. కానీ ఏకోపాధ్యాయ స్కూళ్లలో పర్యవేక్షణ చేయలేక ఉపాధ్యాయులు చేతులెత్తేస్తున్నట్లు సమాచారం.



ప్రొద్దుటూరు డ్రైవర్‌కొట్టాలులోని ఏకోపాధ్యాయ మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

20 మందికి ఒక్కరు..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 20 మందికి ఒక ఉపాధ్యాయులు ఉండాలి. 20 మంది విద్యార్థులు దాటితే ఒక హెచ్‌ఎంతోపాటు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉంటుంది. కానీ ఒకే ఉపాధ్యాయుడు ఉండటం వల్ల బోధనలు కష్టతరంగా మారనుంది, అటు బోధన, ఇటు పర్యవేక్షణ చేయడం ఇబ్బందికరంగా మారుతోందని ఏకోపాధ్యాయులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఏకోపాధ్యాయ పాఠశాలల పట్ల స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పిల్లల చదువేం కావాలి..

జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఏదైనా అత్యవసర పనుల మీద సెలవు పెడితే.. విద్యార్థుల చదువు పరిస్థితేందటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇదివరకు సమీపంలోని స్కూల్ నుంచి డిప్యూటేషన్‌పై మరో ఉపాధ్యాయుడిని నియమించేవారు. ఇప్పుడా పరిస్థితి కూడా లేనట్లు తెలిసింది. దీంతో అయ్యవారు సెలవు పెడితే విద్యార్థులకు కూడా అప్రకటిత సెలవు ఇచ్చేస్తున్నట్లు సమాచారం. లేదంటే ఎమ్మార్సీ పరిధిలో పనిచేసే సీఆర్‌పీలు అక్కడికి వెళ్లి పాఠశాలలను నిర్వహించాల్సి ఉంటుంది. ఇలా జరగడం వల్ల విద్యార్థులకు ప్రాథమిక విద్య బోధన కుంటుపడక తప్పదని ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలకు రెగ్యులర్ టీచర్ సెలవు పెట్టినప్పుడు వేరొక టీచర్ బోధించడం తరువాత మరొక టీచర్ బోధించడం వంటి సమస్యలతో పిల్లలకు కొంతమేర ఇబ్బందికర వాతావరణం చోటు చేసుకుంటుందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

యూరియా వినియోగంపై దృష్టి సారించాలి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో వ్యవసాయ అవసరాల నిమిత్తం ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియాను అక్రమంగా విక్రయించడం లేదా ఇతర అవసరాలకు మళ్లించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో టెక్నికల్ గ్రేడ్ యూరియా, నత్రజని వనరుగా ఉన్న సబ్సిడీ యూరియాను పరిశ్రమల అవసరాలకు మళ్లిస్తున్నారన్న విషయమై వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించి, వ్యవసాయంతో పాటు యూరియాను వినియోగిస్తున్న పలు పరిశ్రమలను గుర్తించి, వారి అవసరాలకు ఎక్కడి నుంచి యూరియాను కొనుగోలు చేస్తున్నారన్న వివరాలపై ఆరా తీయాలన్నారు. జిల్లాలో వివిధ రకాల పరిశ్రమల్లో తుది ఉత్పత్తుల కోసం నత్రజని సమ్మేళనాలను ఉపయోగిస్తున్నాయన్న విషయంపై సంబంధిత అధికారులు ప్రత్యేక ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలను ముమ్మరం చేయాలన్నారు. అక్రమంగా యూరియాను వినియోగిస్తున్నా, అధిక ధరలకు విక్రయిస్తున్నా, కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

కంట్రోల్ రూమ్ నెంబర్ల ఏర్పాటు

జిల్లాలో వ్యవసాయ అవసరాల నిమిత్తం ఇప్పటికే 7,186 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామన్నారు. యూరియాకు సంబంధించి సమస్యల స్వీకరణకు ప్రత్యేకంగా కంట్రోల్ రూము నెంబర్లు 8331057300, 9491940106, 8919081933లను అందుబాటులోఉంచామన్నారు.

ప్రతి గ్రామానికి ఆర్థిక పరిపుష్టి చేకూరాలి

గ్రామాల్లో సుస్థిర జీవనోపాధులను నెలకొల్పి రైతులకు ఆర్థిక పరిపుష్టి చేకూర్చేలా రైతు ఉత్పత్తి సంస్థ (ఎఫ్‌పీఓ)లు, స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీ టింగ్ హాలులో గ్రామీణాభివృద్ధి, బ్యాంకింగ్, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు, ఎఫ్‌పీఓలను ఒకే గొడుగు కింద చేర్చి ప్రాధాన్యత రంగాలకు సంబంధించి అన్ని రకాల వనరులను సద్వినియోగం చేస్తూ ఆయా కుటుంబాలకు ఆర్థిక పరిపుష్టికి చర్యలు చేపట్టాలన్నారు. డీఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి గ్రామాల్లో సుస్థిర జీవనోపాధి కల్పనపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు.

దెబ్బతిన్న గ్యాస్ పైపులైన్లు

– శరవేగంగా పునరుద్ధరించిన సంస్థ



గ్యాస్ పైపులైన్ దెబ్బతినడానికి కారణమైన డ్రైనేజీ పనులు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో అనధికార తవ్వకాల వల్ల రెండు చోట్ల దెబ్బతిన్న గ్యాస్ పైపులైన్లను థింక్ గ్యాస్ సంస్థ శరవేగంగా మరమ్మతులు చేసి పునరుద్ధరించింది. మంగళవారం ఆ సంస్థ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. డ్రైనేజీ నిర్మాణ సమయంలో మారుతీనగర్‌లో నాగార్జున స్కూల్ సమీపంలో 20 మి.మీ తక్కువ పీడన పైపులైన్ దెబ్బతిందని, అలాగే వైఎస్సార్ కాలనీ గంగమ్మ ఆలయం సమీపంలో రోడ్డు తవ్వకం వల్ల 32 మి.మీ తక్కువ పీడన సహజ వాయువు పైపులైన్ దెదెబ్బతినిందన్నారు. ఈ రెండు ఘటనల వల్ల గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. వెంటనే రంగంలోకి దిగిన థింక్ గ్యాస్(గతంలో ఏజీఅండీపీ ప్రథమ్) అత్యవసర ప్రతిస్పందన బృందం ప్రభావిత ప్రాంతాలకు చేరుకొని మరమ్మతులు చేసి, గ్యాస్ సరఫరాను పునరుద్ధరించామన్నారు. తద్వారా ప్రజల భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అదే సమయంలో పైపులైన్ దెబ్బతినడానికి కారణమైన వారిపై తగు చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. గ్యాస్ లీకేజీలు, ప్రమాదాలను నివారించడానికి ఏ విధమైన రోడ్డు తవ్వకం పనులకు ముందు అయినా 'డయల్ బిఫోర్ యు డిగ్' – 1800 2022 999 కు కాల్ చేయాల్సిందిగా కోరారు.

అధికారులూ.. ఈ ఆక్రమణ కనిపించలేదా!

- మైదుకూరులో కేసీ కెనాల్ స్థలంలో వాటల్ ప్లాంట్ నిర్వహణ
- అధికార పార్టీ అండ ఉంటే అధికారులు పట్టించుకోరా
- వైఎస్సార్‌సీపీ నేతల డాబా అయితే కూల్చేస్తారా..!



మైదుకూరులోని నంద్యాల రోడ్డులో కేసీ కాలువ స్థలంలో ఉన్న వాటర్ ప్లాంట్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : అధికార పార్టీ అండదండలుంటే ఎలాంటి తప్పు జరిగినా.. స్థలాలు ఆక్రమణకు గురైనా అధికారులు పట్టించుకోకపోవడం .. అదే ప్రత్యర్థి పార్టీ వర్గీయులైతే.. అధికార పార్టీ ఒత్తిడి ఉంటే బాధితుడికి నష్టం కలిగించే దుశ్చర్యకు ఏమాత్రం వెనుకాడకపోవడం అధికారులకు నిత్యకృత్యమైంది. మైదుకూరు నియోజకవర్గం దువ్వూరు మండలం ఇడమడక సమీపంలో వైఎస్సార్‌సీపీ నేత నగరి శ్రీకాంత్‌కు చెందిన దాబాను సోమవారం రెవెన్యూ, పోలీసు అధికారులు కూల్చేశారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన పట్టా ఉన్నప్పటికీ లెక్క చేయని అధికారులు తెల్లవారుజామున 5 గంటలకు జేసీబీ పెట్టించి కూల్చి వేసి లక్షల్లో నష్టం కలిగించారు. అయితే మైదుకూరులో మాత్రం కేసీ కాలువ పక్కనే దానికి సంబంధించిన స్థలంలో ఏకంగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా లక్షలు సంపాదిస్తున్నా.. దీనిపైన ఫిర్యాదు అందినా ఆ వైపు సాగునీటి అధికారులు గానీ, రెవెన్యూ అధికారులు గానీ కన్నెత్తి చూడకపోవడం శోచనీయం. మైదుకూరు పట్టణం నంద్యాల రోడ్డులో సంతకు వెళ్లే దారిలో రోడ్డు పక్కనే ఉండే కేసీ కెనాల్ అనుబంధమైన కొండపేట కాలువ స్థలంలో ఏడాది క్రితం మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర బంధువు సుబ్బారావు తనకు కావాల్సిన ఓ కుటుంబానికి కేసీ కెనాల్ స్థలంలో వాటర్ ప్లాంట్ పెట్టించాడు. దీని ద్వారా మినరల్ వాటర్ వ్యాపారం చేస్తూ లక్షలు సంపాదిస్తున్నారు. కేసీ కెనాల్ స్థలంలో కడప–కర్నూలు జాతీయ రహదారి పక్కనే 5 సెంట్ల వరకూ స్థలం ఆక్రమించి వాటర్ ప్లాంట్ నిర్మించుకుని దర్జాగా వ్యాపారం చేసుకుంటున్నారు. దీని వెనకాలే సొంత స్థలాల్లో కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వారు సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నప్పటికీ వారికి దారి లేకుండా ఈ వాటర్ ప్లాంట్ అడ్డుగా నిర్మించారు. ఇది ప్రభుత్వ స్థలం కావడంతోనే విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను సైతం ఇక్కడ ఏర్పాటు చేశారు. అధికార పార్టీ అండదండల వల్లనే ఈ వాటర్ ప్లాంట్‌పై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కేసీ కెనాల్ స్థలం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ స్థలాలను కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

ములకలచెరువు : చౌడసముద్రం పంచాయతీ చెట్లవారిపల్లెకు చెందిన జి. వంశీకృష్ణారెడ్డి (30) ఆత్మహత్య చేసుకున్నాడు. డిగ్రీ వరకు చదువుకొని ఇంటి వద్దే ఉంటున్న ఇతను వివాహం కాలేదని, ఉద్యోగం లేదని మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు.

ప్లాన్ లేకుండా అక్రమ నిర్మాణాలు

- కల్యాణ మండపం, షాపు రూముల ఏర్పాటు
- చోద్యం చూస్తున్న నగరపాలక ప్లానింగ్ అధికారులు



సాయిబాబా నగర్(ఎస్టీ కాలనీ)లో ప్లాన్ లేకుండా చేపట్టిన నిర్మాణాలు



సాయిబాబా నగర్‌లో ఆక్రమించేందుకు చదును చేసిన స్థలం

కడప కార్పొరేషన్ : కడప నగరంలో ఎలాంటి ప్లాన్ లేకుండా నిర్మాణాలు చేపడుతున్నా నగరపాలక టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నగర శివార్లలో ఇందిరానగర్ సమీపంలో ఉన్న సాయిబాబా నగర్(ఎస్టీ కాలనీ)లో ఇందిరాగాంధీ హయాంలో యానాదులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ప్రస్తుతం ఈ కాలనీలో 60 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇక్కడ నివాస గృహాలకు తప్పా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం తదితర వాటికి స్థలాలు లేవు. కానీ అధికార పార్టీకి చెందిన అగ్రవర్ణాల వారు ఈ కాలనీలో ప్రవేశించి సుమారు 0.20 సెంట్లలో కల్యాణ మండపం, షాపు రూములు నిర్మించారు. ఈ షాపు రూములను వైన్ షాపులకు బాడుగకు ఇచ్చారు. అయితే ఎలాంటి ప్లాన్ అప్రూవల్స్ లేకుండా నిర్మించిన ఈ నిర్మాణాల పట్ల నగరపాలక అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. మామిళ్లపల్లె గ్రామ పొలం సర్వే నంబర్ 729లో నివాస గృహాలకు మాత్రమే కేటాయించిన స్థలాలను, వంక పొరంబోకు స్థలాలను ఆక్రమించి వ్యాపార సముదాయాలను నిర్మించడం పట్ల ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాంతంలో రిమ్స్‌తోపాటు ఇతర హాస్పిటల్స్, విద్యాసంస్థలు నెలకొనడంతో భూములకు విలువ పెరిగింది. దీంతో ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను అమ్మడం, కొనడం నేరమైనా సరే పేదలకు పదో పరకో ఇచ్చి స్వాధీనం చేసుకుంటున్నారని తెలుస్తోంది. దొంగ డాక్యుమెంట్లు సృష్టించి ఈ స్థలాలను ఆక్రమించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి అక్రమ నిర్మాణాల పట్ల టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎందుకు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాలని పలువురు కోరుతున్నారు.

యూరియాను ఎమ్మార్పీ కంటే అధిక ధరకు అమ్మితే చర్యలు



ఎరువుల దుకాణంలో లైసెన్సును పరిశీలిస్తున్న డీఏఓ చంద్రానాయక్

కడప అగ్రికల్చర్ : జిల్లాలో ఎరువుల దుకాణ యజమానులెవరైనా యూరియాను ఎమ్మార్పీ కంటే అధిక రేటుకు అమ్మితే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ హెచ్చరించారు. మంగళవారం కడప ఏఓ సురేష్‌కుమార్‌రెడ్డి, జేడీఏ కార్యాలయ వ్యవసాయ అధికారి గోవర్ధన్‌లతో కలిసి కడపలోని మహేశ్వరి ఫర్టిలైజర్ ప్లాంట్‌తో పాటు పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టాక్ రిజిస్టర్, ఎరువుల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణదారులందరు తప్పని సరిగా స్టాక్ రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. అలాగే ఎరువుల ధరల బోర్డును షాపులో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతోపాటు ఎరువుల గ్రౌండ్ బ్యాలెన్స్‌కు, ఈ పాస్ మిషన్ బ్యాలెన్స్‌కు ఎలాంటి తేడా లేకుండా చేసుకోవాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో తీవ్ర జాప్యం



ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీని కలిసేందుకు వచ్చిన బాధితులు

కడప కార్పొరేషన్ : చింతకొమ్మదిన్నె మండలం, మామిళ్లపల్లె పంచాయతీ, ఇందిరానగర్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో విచారణ తీవ్ర ఆలస్యమవుతోందని ఇందిరానగర్‌కు చెందిన పల్లం చంద్రయ్య, ఆయన భార్య రామలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీకి వినతి పత్రం సమర్పించారు. ఇందిరానగర్‌లో కిరాణాషాపు నడుపుతూ తాము జీవిస్తున్నామని, వివిధ వస్తువులు కొనేందుకు షాపు వద్దకు జనం వస్తుంటారన్నారు. దీన్ని జీర్ణించుకోలేని అగ్రవర్ణాల వారు అక్కడి నుంచి తమ షాపు తీయించాలని కులం పేరుతో దూషించి, దౌర్జన్యం చేస్తున్నారన్నారు. దీనిపై తాను ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశానని, ఈ మేరకు సీకే దిన్నె పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఉన్నారన్నారు. మూడు నెలలు అవుతున్నా ఈ కేసుపై విచారణ జరక్కపోవడంతో అగ్రవర్ణాల వారు మరింత రెచ్చిపోతూ తమ కుటుంబాన్ని నానా రకాలుగా ఇబ్బంది పెడుతున్నారని, సాక్షులను కూడా బెదిరిస్తున్నారన్నారు. విచారణ త్వరగా పూర్తి చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితుల వెంట మహాజన రాజ్యం పార్టీ అధ్యక్షుడు సంగటి మనోహర్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తొమ్మిది నెలలుగా జీతాలు లేని కాంట్రాక్టు సిబ్బంది



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కేజీబీవీ పాఠశాలల కాంట్రాక్టు ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల్లో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న సిబ్బందికి తొమ్మిది నెలలుగా జీతాలు ఇవ్వనందుకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం జరిగింది. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా మాట్లాడుతూ జీతాలు ఇవ్వాలని అనేక పర్యాయాలు గ్రీవెన్స్‌సెల్‌లో, సర్వశిక్ష అభియాన్ అధికారులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వేతనాలు అందక కుక్‌లు, అసిస్టెంట్ కుక్‌లు, వాచ్‌మెన్లు, పార్ట్ టైమ్ టీచర్ల కుటుంబాల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం, ఆటంకం కలిగించకుండా విధులు నిర్వహిస్తూ వస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లించే విషయంలో మంత్రి నారా లోకేష్ తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు.

నేటి నుంచి కోర్టులలో పోస్టుల భర్తీకి రాత పరీక్ష

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా కోర్టులలో వివిధ విభాగాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు రాత పరీక్షలు ఈనెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు కడప నగర శివార్లలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల, కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల, కేఎల్ఎం ఇంజినీరింగ్ కళాశాల, కేఓఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల, అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తారన్నారు. అలాగే రాయచోటిలో శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల, భాస్కర్ ఇంజినీరింగ్ కళాశాలలో, ప్రొద్దుటూరులో శ్రీ రాజేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షలు ప్రతిరోజు మూడు షిఫ్టులలో ఉంటాయన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్, ఒక గుర్తింపు కార్డును తీసుకొని రావాలన్నారు. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాలు ముందే హాజరు కావాలని, నిర్దీత సమయం దాటిన తర్వాత లోనికి అనుమతించరని స్పష్టం చేశారు.


మాజీ సైనికుల కోసం న్యాయ సేవల క్లినిక్ ప్రారంభం



లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని

కడప అర్బన్ : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కడప నగరంలోని జిల్లా సైనిక బోర్డులో బుధవారం మాజీ సైనికుల కోసం న్యాయ సేవల క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సి.యామిని మాట్లాడుతూ న్యాయ సంబంధ సమస్యల పరిష్కారం కోసం ఈ క్లినిక్‌ను సందర్శించవచ్చన్నారు. ఒక ప్యానల్ న్యాయవాది, ఒక పారా లీగల్ వలంటీర్ అందుబాటులో ఉంటారన్నారు. వీరు ప్రతి సోమ, శుక్ర వారాల్లో మాజీ సైనికుల సమస్యలను తెలుసుకుని వారికి తగు సలహాలను ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్‌లు ఎమ్.శాంత, ఎన్.చంద్రకాంతమ్మ, ఎం.వినయ్ కుమార్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పి.మనోహర్, ఎం సౌజన్య, ఎన్. నీలకంఠేశ్వర రెడ్డి, షేక్ అక్బర్ అలీ, ఏఎస్.రవితేజ, కడప మాజీ సైనికుల సంక్షేమ బోర్డు వైస్ ప్రెసిడెంట్ ఆర్.సుధాకర్ రెడ్డి, పారా లీగల్ వలంటీర్ బీవీ గోపాల్ రెడ్డి, మాజీ సైనికులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత వైఎస్సార్ కడప జిల్లా జట్టు



ఫుట్‌బాల్ మ్యాచ్‌లో విజేతగా నిలిచిన వైఎస్సార్ కడప జిల్లా బాలికల జట్టు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏపీ సబ్ జూనియర్ బాలికల అంతర్ జిల్లా ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేతగా కడప జిల్లా జట్టు నిలిచింది. ఇటీవల అన్నమయ్య జిల్లాలోని మదనపల్లెలో జరిగిన ఈ టోర్నమెంటులో జిల్లా బాలికలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురంపై 3–0 తేడాతో గెలిచారు. ఈ టోర్నమెంటులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణులు రాష్ట్ర జట్టుకు ఎంపికై ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నారాయణపూర్‌లో జరిగే సబ్ జూనియర్ బాలికల జాతీయ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. కాగా రాష్ట్ర జట్టుకు ఎంపికైన వారిలో బి.భార్గవి (గోల్ కీపర్), వై.అశ్విని, ఆర్‌బీ మైథిలి, సాద్విక, నవ్యశ్రీ, వర్షితారెడ్డి ఉన్నారు.

'నా భర్త ఆచూకీ తెలపండి'

కడప రూరల్ : తన భర్త భూమిని కౌలుకు తీసుకున్నాడు. పంట చేతికి వచ్చే సమయంలో కనిపించకుండా పోయాడు. న్యాయం చేయాలని బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందిన నవ్య శ్రీ తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నాయీ బ్రాహ్మణ జేఏసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త నాగేశ్వరరావు, వైయస్సార్ జిల్లా పోరుమామిళ్ల పరిధిలోని పులివీడు గ్రామ పరిధిలో ఖాజాపీర్ అనే వ్యక్తి వద్ద 17 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారని పేర్కొన్నారు. తన భర్తతోపాటు బాపట్ల జిల్లాకు చెందిన మరో వ్యక్తికి కూడా భాగస్వామ్యం ఉందన్నారు. మొత్తం రూ 20 లక్షలకు గాను అందులో రూ.7 లక్షలు భూమి యజమానికి ఇవ్వగా, మిగతా డబ్బును జామ పంట కోసం పెట్టుబడిగా పెట్టారన్నారు. పంట చేతికి వచ్చే సమయంలో ఏప్రిల్ 7వ తేదీ నుంచి తన భర్త కనిపించడం లేదన్నారు. ఈ విషయమై తమకు అనుమానాలు ఉన్నాయని, ఆ వివరాలు తెలుపుతూ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. వారు పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్‌కు రెఫర్ చేశారని తెలిపారు. అయితే ఇప్పటివరకు తన భర్త ఆచూకీ తెలియకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తమకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారావు మాట్లాడుతూ పంట చేతికొచ్చే సమయంలో నాగేశ్వరరావు అదృశ్యం కావడం వెనక బలమైన కారణాలు ఉన్నాయని ఆరోపించారు. తక్షణం పోలీసులు చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసులు, వెంకటరమణ, మునిస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.